ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 8 ఫిబ్రవరి 2024



నిధుల్లేని బడ్జెట్



ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులే లేవు. గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీలే గాలిలో కలిశాయి. ఇక ఈ బడ్జెట్‌తో జిల్లా ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. ఏ వర్గానికి మేలు చేకూరదు. పేపర్లో చూడటానికి తప్ప.. ప్రజలకు ఉపయోగం లేదు. - బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

- కేటాయింపుల ప్రస్తావనే లేదు..
- పారిశ్రామికాభివృద్ధి ఊసెత్తని వైనం
- సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- రైతాంగానికి భరోసాతో సరి
- ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై జిల్లావాసుల పెదవి విరుపు

కొత్త జిల్లాకు
ఉత్త చెయ్యే..!



పుట్టపర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ ఉత్తచెయ్యి చూపారు. ఎంతో ఇస్తారని ఆశించిన జిల్లావాసికి నిరాశే మిగిలింది. ఏ రంగానికీ కేటాయింపుల్లేవు. పారిశ్రామికాభివృద్ధికి పైసా ఇవ్వలేదు, ఉపాధి కల్పన ఊసేలేదు, రైతాంగానికి పాత భరోసాతోనే సరిపెట్టారు. అసెంబ్లీలో బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ 2024-25 వార్షిక బడ్జెట్ జిల్లావాసులకు తీవ్ర నిరాశ మిగిల్చింది. ఏడాదిన్నర కిందట ఏర్పడిన కొత్త జిల్లాలో కీలక రంగాలైన పారిశ్రామికం, వ్యవసాయం, సాగునీరు, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అంకెలగారడీ చేశారు. కొత్త జిల్లా ఏర్పాటు చేసి రెండేళ్లవుతున్నా కేటాయింపులు లేకపోగా.. కేవలం నవరత్నాలు, సంక్షేమ పదాలతోనే బడ్జెట్ ప్రసంగం సాగింది. పట్టు పరిశ్రమతోపాటు చేనేత రంగానికి చేయూతనివ్వాల్సి ఉన్నా.. ఆ ఊసేలేకుండా పోయింది. ఏకగవాక్ష విధానంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా రూ.5995 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి మొదలు పెట్టినట్లు, 1367618 మందికి ఉపాధి కల్పించినట్లు నివేదించారు. పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం కోసం విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో చెన్నై-బెంగళూరు-హైదరాబాద్-బెంగళూరు కారిడార్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించారు. రైతాంగానికి పాత పథకాలనే కొనసాగించడంతోపాటు ధరల స్థిరీకరణ నిధితో సరిపెట్టారు. రాష్ట్రంలో నూతన మెడికల్ కళాశాల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పినా పెనుకొండలో రెండున్నరేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కళాశాల పనుల మాటే ఎత్తకుండా వదిలేశారు. బీసీల ఖిల్లాగా ఉన్న జిల్లాలో వెనుకబడిన కులాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆయావర్గాల ఆర్థికాభివృద్ధికి పైసా నిధులిచ్చిందిలేదు. పైగా ఇతర పథకాల ఖర్చు చూపించి, బీసీ సంక్షేమమంటూ ఊదరగొట్టారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ప్రస్తావనే లేదు. టీడీపీ హయాంలో గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నిర్మించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ పరోక్ష పన్నులు, నార్కోటిక్స్ (నాసిన్)కు తమ ప్రభుత్వం మద్దతు ఇచ్చిందని బడ్జెట్‌లో బుగ్గన చెప్పడం ఆశ్చర్య కలిగించింది. ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి పైసా నిధులిచ్చింది లేదు కానీ, ఎంతో చేసినట్లు చెప్పుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2023 సంవత్సరానికి ఉత్తమ పర్యాటక గ్రామంగా లేపాక్షి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. టీడీపీ హయాంలో లేపాక్షి ఉత్సవాల ద్వారా వారసత్వ సంపద వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. వైసీపీ అధికారం చేపట్టాక లేపాక్షిని పూర్తిగా విస్మరించారు. అయినా పర్యాటక రంగానికి ఊతమిచ్చినట్లు బుగ్గన చెప్పడం హాస్యాస్పదం.



నిరాశాజనకంగా ఉంది



బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. పేదలకు ఉపయోగపడని బడ్జెట్. వ్యవసాయానికి ప్రాధాన్యత లేదు, సాగుకు నిధులు కేటాయించలేదు. పరిశ్రమలకు రాయితీలు కూడా లేవు. పేదలకు షాక్ ఇచ్చేలా ఉంది.
- పల్లె రఘునాథ రెడ్డి, మాజీ మంత్రి

రైతన్నకు పాత పథకాలే..



రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు, ఆర్బీకేలు, అగ్రికల్చరల్ ల్యాబ్‌ల నిర్వహణ తదితరాలకే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పరిమితమైంది. కొత్తగా ఏమైనా ప్రకటిస్తారేమోనని ఆశించిన రైతుకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు తగ్గడం, అరకొరగా చేతికందిన పంట ఉత్పత్తులకు ధరలు లేక జిల్లా రైతు సర్వం నష్టపోయాడు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో మాత్రం ఏడు మండలాల్లోనే తీవ్ర కరువు, 14 మండలాల్లో మధ్యస్థంగా ఉన్నట్లు పేర్కొంది. తీవ్ర దుర్భిక్షం ఉన్నా జాబితాలో చోటు దక్కని 11 మండలాల రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఖరీఫ్ సాగు విస్తీర్ణం లక్ష్యానికి చాలా దూరంలోనే నిలిచిపోయింది. వేసిన పంటలు కూడా చేతికరాక రబీ డీలా పడింది. అంతటా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టి కంటితుడుపుగా కొన్ని మండలాల్లోనే కరువు ఉన్నట్లు ప్రకటించడంపై తీవ్ర ఆందోళన నెలకొంది. రైతును గట్టెక్కించేందుకు బడ్జెట్‌లో ఏమాత్రం చొరవ చూపకపోవడం శోచనీయం. టీడీపీ హయాంలో సబ్సిడీ ఇచ్చే సూక్ష్మసేద్యాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రెండేళ్లుగా భారీ వర్షాలు, వరదలకు సాగుచేసిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతుకు ఇచ్చే పంట నష్టపరిహారం, బీమా నిబంధనలతో కొంతమంది రైతులకు ఇచ్చి.. వేలాది మందికి ఎగ్గొటారు. పట్టురైతుతో పాటు రీలర్లకు అందించే ప్రోత్సాహకాలను నాలుగేళ్లుగా రూ.60 కోట్లకు పైగా పెండింగ్ పెట్టారు. కొత్తగా కేటాయింపులు కూడా చేయలేదు.



ఎన్నికల కరపత్రం..



బడ్జెట్ వైసీపీ కరపత్రంలా ఉంది. బుగ్గన బడ్జెట్ అంతా తప్పుడు లెక్కలే. గణాంకాలు నమ్మదగ్గరీతిలో ఒకటీ లేవు. రాష్ట్రం 12 లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయినా అతితక్కువ అప్పులు ఉన్నట్లు బడ్జెట్‌లో చూపడం దారుణం.
- వేమయ్య యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

సాగునీటి ప్రాజెక్టుల ఊసేదీ?

ప్రాధాన్య ప్రాజెక్టులన్నింటినీ సకాలంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి వెల్లడించారు. రాప్తాడు నియోజకవర్గంలోని వెంకటంపల్లి, దేవరకొండ, తోపుదుర్తి, ముట్టాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కింద రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.803 కోట్లు మంజూరు చేస్తూ.. 2020 డిసెంబరు 9న ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ పద్ధతిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులకు 820 ఎకరాలు భూమి సేకరించాల్సి ఉంది. నిధులు కేటాయించకపోవడంతో భూసేకరణ కూడా మొదలవలేదు. పుట్టపర్తి నియోజక వర్గంలోని 193 చెరువులకు హంద్రీనీవా ఎత్తిపోతల ద్వారా రూ.737 కోట్లతో నీరిచ్చే పథకానికి 2020లో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, టెండర్లు పిలిచింది. గతనెల 18న పనులు మొదలు పెట్టారు. ఇంతవరకు భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదు. హిందూపురం నియోజకవర్గం మడకశిర ఉపకాలువ నుంచి చిలమత్తూరు మండలంలోని చెరువులను హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా నింపేందుకు 2018లో టీడీపీ హయాంలో రూ.540 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారు. ఆర్థిక శాఖ అనుమతులు, టెండర్ల కోసం ఎదురుచూస్తోంది. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా టీడీపీ హయాంలో నీరిచ్చిన చెరువులకు మినహా కొత్తగా ఏ ఒక్కదానికీ నీరిచ్చేందుకు నిధులు కేటాయించిందిలేదు. పైగా గతంలో తవ్విన కాలువల మరమ్మతులకు సైతం బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం రైతుకు నిరాశ మిగిల్చింది.





గణేశ్ మృతదేహాన్ని మోసుకెళ్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న బెటాలియన్ డీఐజీ వెంకటేశ్వర్లు

పోలీసు లాంఛనాలతో గణేశ్ అంత్యక్రియలు

హాజరైన బెటాలియన్ డీఐజీ వెంకటేశ్వర్లు

ధర్మవరం, ఫిబ్రవరి 7: మృతిచెందిన 14వ బెటాలియన్ కానిస్టేబుల్ గణేశ్ అంత్యక్రియలు బుధవారం గుట్టకిందపల్లిలో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. బెటాలియన్ డీఐజీ వెంకటేశ్వర్లుతోపాటు సిబ్బంది హాజరై అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయమే అక్కడికి చేరుకున్న బెటాలియన్ సిబ్బంది తొలుత గణేశ్ భౌతికకాయానికి నివాళులర్పించి అనంతరం శ్మశానానికి తరలించారు. అంత్యక్రియల సందర్భంగా పోలీసు సిబ్బంది గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి నివాళులర్పించారు. డీఐజీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేశ్ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందాడన్నారు. గణేశ్ వీర మరణం తమను ఎంతో బాధించిందన్నారు. గణేశ్ కుటుంబానికి పోలీసు శాఖ పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. అంతకు ముందు గణేశ్‌ను చివరి చూపు చూడటానికి గ్రామస్థులు, ఇతర ప్రాంతాల వారు భారీగా తరలివచ్చారు. అంత్యక్రియల సందర్భంగా భార్య, కుటుంబసభ్యుల రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి. పసివయస్సులో ఉన్న పిల్లలు ఇద్దరు తండ్రి మృతదేహం వద్ద అమాయకంగా నిలబడి ఉండటం చూసి పలువురు అయ్యో పాపం అంటూ కంటతడి పెట్టారు.



గాలిలోకి కాల్పులు జరుపుతున్న సిబ్బంది

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

జిల్లా అధ్యక్షుడు బీకే

గోరంట్ల, ఫిబ్రవరి 7: టీడీపీ అధికారంలోకి వస్తేనే బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఎంఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బీకే మాట్లాడుతూ.. బీసీలకు ప్రాతినిధ్యం లేని జిల్లాపరిషత్‌లో ఎన్టీఆర్ 1985లో తొలిసారిగా లింగరాజుకు అవకాశం కల్పించారన్నారు. తరువాత బీకే పార్థసారథి, తిప్పేస్వామి, నాగరాజు, సూర్యనారాయణ తదితరులకు టీడీపీ అవకాశం కల్పించిందన్నారు. 1999లో ఉమ్మడి జిల్లాలో తొట్టతొలిసారిగా ఇద్దరు బీసీలు అనంతపురం ఎంపీగా కాలవ శ్రీనివాసులు, హిందూపురం నుంచి తాను ఎన్నికయ్యామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల హక్కుల రక్షణకు చట్టం తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నారాయణ వలస పక్షి అని తాను ముందే చెప్పానన్నారు. ఆయన సోదరుల ద్వారా దోపిడీ చేసి, ఇప్పుడు అనంతపురం పార్లమెంటు స్థానంపై పడ్డారన్నారు. బెంగళూరు, కళ్యాణదుర్గం నుంచి మరో వలస పక్షి ఉషశ్రీ చరన్ వచ్చారన్నారు. ఆమె కళ్యాణదుర్గం నుంచి రోజూ వంద టిప్పర్ల ఇసుక మడకశిర గుండా కర్ణాటకకు తరలిస్తుండేవారని ఆరోపించారు. ఈలెక్కన ఆమె ఇసుక ద్వారానే రోజుకు రూ.వందకోట్లు అక్రమంగా గడిస్తోందన్నారు. భూ కబ్జాల్లో అడ్డువచ్చిన వైసీపీ వారిని కూడా వదల్లేదనీ, అలాంటి చెత్తను తెచ్చి పెనుకొండలో పడేశారంటూ దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పరిశీలకుడు నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, కన్వీనర్ సోముశేఖర్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న టీడీపీ నేతలు

దేవదాయ శాఖ పరిధిలోకి
23 ఆలయాలు

పెనుకొండ, ఫిబ్రవరి 7: జిల్లావ్యాప్తంగా 23 పురాతన దేవాలయాలను దేవదాయ శాఖ పరిధిలోకి చేర్చనున్నట్లు ఆశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆయా ఆలయాలను దేవదాయ శాఖ రిజిస్టర్ చేయదలిచామన్నారు. అభ్యంతరాలుంటే 15 రోజుల్లోగా జిల్లా దేవదాయశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.

దళితుడిపై వైసీపీ సర్పంచ్
కుటుంబికుల దాడి

ఆలస్యంగా వెలుగులోకి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

గోరంట్ల, ఫిబ్రవరి 7: మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ వైసీపీ మద్దతు సర్పంచ్ అనిత కుటుంబికులు అదే ఊరికి చెందిన దళితుడు హరిజన గంగాధర్‌పై తీవ్రంగా దాడి చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సర్పంచ్ అని భర్త, వైసీపీ నాయకుడు వెంకటరమణ, మామ లక్ష్మీనారాయణ, చిన్న కుమారుడు హరిపై గోరంట్ల పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. గంగాధర్ కొంతకాలంగా కర్ణాటకలోని బాగేపల్లిలో ఆటో నడుపుకుంటూ అక్కడే ఉంటున్నాడు. ప్రతినెలా స్వగ్రామమైన కొండాపురం వచ్చి రేషన్ బియ్యం తీసుకెళ్లేవాడు. ఈనెల 5న రేషన్‌కోసం కొండాపురం రాగా.. దుకాణానికి తాళం వేసి ఉంది. విషయాన్ని గ్రామ సర్పంచ్ అనిత భర్త వెంకటరమణతో గంగాధర్ ప్రస్తావించాడు. స్టోర్ నిర్వహణపై వారిరువురి మధ్య వాగ్వాదం తలెత్తింది. దీంతో ఆగ్రహానికి లోనైన వెంకటరమణ అదేరోజు సాయంత్రం గంగాధర్, అతడి కుమారుడు గుణశేఖర్ ఆటోలో బాగేపల్లికి వెళ్తుండగా.. ముద్దలకుంటపల్లి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి దాడిచేశారు. దీంతో గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పెనుకొండ, హిందూపురంలో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు గోరంట్ల పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. కులం పేరుతో దుర్భాషలాడుతూ వెంకటరమణ, లక్ష్మీనారాయణ, హరి కొట్టడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా బుధవారం గోరంట్లకు వచ్చి ముద్దలకుంటపల్లి వద్ద దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామంలో విచారణ చేపట్టారు. ఆయన వెంట సీఐ సుబ్బరాయుడు ఉన్నారు.




దాడిలో గాయపడిన గంగాధర్

ముందుచూపు..!

పురంలో పెద్దాయన మనుషులు

- కీలక స్థానాలకు సొంత సామాజికవర్గ అధికారులు
- పోలీసు శాఖలో కూడా ముగ్గురు వారే..
- ఇతరులకు ఎలా న్యాయం చేకూరుతుందని ప్రతిపక్షాల ప్రశ్న
- వైసీపీ అడుగులకు మడుగులొత్తే వారికే పెద్దపీట



రాష్ట్రంలో వైసీపీలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి వచ్చే ఎన్నికల్లో ఎలా ఉంటుందో అన్న బెంగ ఆ పార్టీని వెంటాడుతోంది. రోజుకో ఎమ్మెల్యే పార్టీ నుంచి జారుకుంటుండటంతోపాటు ప్రజల్లో వైసీపీపై నెలకొన్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఎన్నికలతో సంబంధం ఉన్న అధికారులు తమ అనుకూలమైన వారుంటే బాగుంటుందని యోచిస్తున్నట్లున్నారు. అందుకేనేమో హిందూపురం నియోజకవర్గంలో కీలకమైన స్థానాలకు ముందుచూపుతో అధికార పార్టీ సమన్వయకర్త వర్గానికి చెందిన అధికారులను రప్పించినట్లు చర్చ సాగుతోంది. నియోజకవర్గంలో వైసీపీ బాధ్యతలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భుజాల మీద మోస్తుండటంతో తమకు అనుకూలమైన అధికారులను ఇక్కడకు రప్పించినట్లు సమాచారం.
- హిందూపురం



చిత్తూరు నుంచి ముగ్గురు..

నియోజకవర్గంలో పోలీసు శాఖలో కీలకమైన స్థానాల్లో ఉన్న అధికారులు పెద్దాయన మనుషులేనన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సబ్‌డివిజన్ స్థాయి అధికారి చిత్తూరు జిల్లాలో పనిచేస్తుండగా.. అయనను ఇక్కడికి తీసుకొచ్చారు. పైపైకి తనకు ఇష్టం లేదంటున్నా.. మంత్రి పెద్దిరెడ్డికి అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు పోలీసు అధికారులను ఇక్కడికి పంపించారు. వీరు చిత్తూరు జిల్లాలో మంత్రి కనుసన్నల్లో పనిచేశారని సమాచారం. అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులను అణచివేసేందుకు కీలకంగా పనిచేసినట్లు అక్కడి పార్టీ వర్గాలు చెప్పుకుంటుంటాయి. మంత్రి కనుసైగ చేస్తే ఈ అధికారులు పనిచేసి పెడతారన్న వాదన ఆ పార్టీ వర్గాల నుంచే వినిపిస్తోంది. దీంతో ఇక్కడ ఉన్న సబ్‌డివిజన్ స్థాయి అధికారులతోపాటు నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పెద్దిరెడ్డికి అనుయాయిలే అనడంలో సందేహం లేదు. ఇటీవల మంత్రి పర్యటన సందర్భంగా వారు చూపిన అత్యుత్సాహమే నిదర్శనం. అదే సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే, సెలబ్రిటీ అయిన నందమూరి బాలకృష్ణ పర్యటనలో ఉన్నా కనీసం ఒక వాహనం కూడా ఎస్కార్ట్‌గా పంపకపోవడాన్ని బట్టి చూస్తే వారు అధికార పార్టీ సేవలో ఏ మేరకు తరిస్తున్నారోనన్న విషయం స్పష్టమవుతోంది. సబ్ డివిజన్ పరిధిలోని అధికారులంతా మంత్రి వెంట ఉన్నారు.



కీలక స్థానాల్లో సొంత సామాజికవర్గ అధికారులు

ఇటీవల ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులను బదిలీ చేశారు. ఇందులో భాగంగా హిందూపురం మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు పంపారు. ప్రస్తుతం ఈ స్థానాలకు వచ్చినవారు అధికార పార్టీ నేతకు చెందిన సొంత సామాజికవర్గ అధికారులే కావడం గమనార్హం. ఇది యాదృచ్ఛితంగా జరిగిందా, మంత్రి పెద్దిరెడ్డి కావాలనే ఇక్కడికి రప్పించారా అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుంది. ఎన్నికలకు సంబంధించి ఈ స్థానాలు కీలకమైనవి. నోటిఫికేషన్ వెలువడిన తరువాత పాలన అంతా అధికారుల చేతుల్లోకి వెళ్తుంది. తమకు అనుకూలంగా ఉన్న అధికారులైతే ఎన్నికల సందర్భంగా ఎత్తులకు పైఎత్తులు, కొన్ని కుట్రలకు అనుకూలంగా ఉంటుందన్న ముందుచూపుతోనే వారిని ఇక్కడికి రప్పించినట్లు తెలుస్తోంది. దశాబ్దాల కాలంలో ఇలా కీలకమైన స్థానాలకు ఒకే సామాజికవర్గానికి చెందిన అధికారులు అదీ ఒకేసారి రావడం ఇదే ప్రథమమని చెప్పవచ్చు. ఎన్నికల నిర్వహణలో వీరి ప్రమేయం ఉంటుంది. ఎన్నికల నిబంధనలు అమలయ్యాక వీరు చేయాల్సిన పని ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఆ సామాజికవర్గ అధికారులైతే బాగుంటుందని భావించి రప్పించినట్లు చర్చ సాగుతోంది.

ఖాకీల్లో ముగ్గురు ఒకే సామాజికవర్గం



హిందూపురం నియోజకవర్గంలో ఇద్దరు పోలీసు అధికారులతో పాటు అనుబంధ శాఖలోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కూడా అదే సామాజిక వర్గానికి చెందినవారు కావడం విశేషం. కొన్ని నెలల క్రితం వచ్చిన ఇద్దరు పోలీసు అధికారులు వైసీపీ కనుసన్నల్లో పనిచేస్తుండటంతో ఆ శాఖకు అనుబంధంగా ఉన్న శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తులను తీసుకురావడం విశేషమని చెప్పవచ్చు. ఈ శాఖలో కూడా ఈ సామాజికవర్గానికి చెందిన అధికారులు ముగ్గురు ఒకేసారి వచ్చిన దాఖలాలులేవు. వారు పెద్దాయనకు అనుకూలంగా ఉండటంతోపాటు స్థానిక వైసీపీ నేతవద్ద ఉన్న ఓ నాయకుడు అదే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఇక్కడికి ఆ సామాజికవర్గ అధికారికి రప్పించినట్లు సమాచారం.

నియోజకవర్గంలో కీలకమైన స్థానాలకు అధికార పార్టీకి చెందిన నేత సామాజికవర్గానికి చెందిన అధికారులు రావడంతో ప్రతిపక్షాలకు ఎలా న్యాయం చేకూరుతుందని కొన్ని పార్టీల నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో వారు మంత్రి చెప్పిన విధంగానే నడుచుకుంటారు. ఎన్నికల సమయంలో ఇలాంటివారు అందరికీ నిష్పక్షపాతంగా ఎలా పనిచేస్తారని ప్రశ్నిస్తున్నారు. పోలీసు శాఖలో కూడా ఓ సామాజికవర్గానికి చెందిన

ఇతరులకు న్యాయం సాధ్యమా?

అధికారి రావడంతో ఎన్నికల సందర్భంగా అధికార పార్టీకి ఒకలా.. ప్రతిపక్ష పార్టీకి మరోలా పని చేస్తారని భావిస్తున్నారు. ఇటీవల వారు ఇక్కడికి వచ్చినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీపై వారు చూస్తున్న చిన్నచూపుతోపాటు అనవసరంగా ఆ పార్టీ నాయకులపై కేసులు బనాయించడం విమర్శలకు తావిస్తోంది. దీనిని బట్టి చూస్తే అధికార పార్టీకి వారు ఏస్థాయిలో పనిచేస్తున్నారో అర్థం అవుతుంది. వీరు వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తేవారు కావడంతో పైరవీలు చేసి అధికార పార్టీకి అనుకూలంగా ఉంటామని చెప్పి వచ్చినట్లు ఓ అధికారి బహిరంగంగా చెప్పుకుంటున్నాడని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని ఓ మండల అధికారి కూడా చిత్తూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. దీనినిబట్టి అధికార పార్టీవారు ఎంత ముందు చూపుతో తెచ్చుకున్నారో అర్థం అవుతుంది. ఏది ఏమైనా అధికార పార్టీకి చెందిన నాయకులు మంత్రిపై ఒత్తిడి తెచ్చి పెద్దాయన మనుషులను ఇక్కడకు రప్పించినట్లు చర్చోపచర్చలు సాగుతున్నాయి.



పల్లె ప్రగతి ఇంతేనా

ఐదేళ్లుగా పల్లెరోడ్లకు మోక్షమేదీ?



రెండేళ్ల కిందట ఆగిపోయిన గుత్తి మండలంలోని తొండపాడు-గొందిపల్లి రోడ్డు నిర్మాణం

- ఉమ్మడి జిల్లాలో పూర్తికాని పనులు
- బిల్లులుకాక వదిలేసిన కాంట్రాక్టర్లు
- అధ్వానంగా మారిన పల్లె రహదారులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలు

అనంతపురం సిటీ/మడకశిర/ కుందుర్పి, ఫిబ్రవరి 7: అభివృద్ధి లేకపోవడంతో పల్లె రోడ్లపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. గత ఐదేళ్లుగా కొత్త రోడ్లు వేయలేదు సరికదా పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు సైతం చేయలేదు. దీంతో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఐదేళ్ల కిందట పీఐయూ కింద రూ. 498.28 కోట్ల నిధులతో ఉమ్మడి జిల్లాలో 332 తారు రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాయి. అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ రోడ్లకు గ్రహణం పట్టినట్లైంది. ఈ రోడ్ల గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. ఎక్కడ చూసిన కంకర వేసి వదిలేసిన రోడ్లు.. మట్టిని తవ్వి వదిలేసిన రోడ్లు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ఓ మహిళా మంత్రి ప్రారంభించిన రోడ్లు కూడా నేటికి పూర్తి కాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అలసత్వానికి తార్కాణంగా నిలుస్తోంది. అధికార లెక్కల ప్రకారం.. ఇప్పటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 332 రోడ్లలో 151 రోడ్లు మాత్రమే పూర్తి కాగా.. ఇప్పటికీ 117 రోడ్ల పనులు ప్రారంభమే కాలేదు.



ఏడాది కిందట కంకర వేసి వదిలేసిన విడపనకల్లు మండలం ఆర్ కొట్టాల-దొనేకల్లు రోడ్డు

ఐదేళ్లుగా పల్లె రోడ్లకు కలగని మోక్షం...

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలోని 332 రోడ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం చెప్పున నిధులతో 2018-19లో ఈ పనులకు రూ. 498.28 కోట్లు కేటాయించారు. ఈ పనులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకు కింద చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పనులను ఆశించిన స్థాయిలో చేయకపోగా.. పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించ డంతోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పనులు పూర్తిగా పడకేశాయనే ప్రచారం ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. ప్రధానంగా కళ్యాణదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లో మంజూరైన రోడ్లను పూర్తిగా విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. రూ. 35.26 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల పరిధిలో మంజూరైన రోడ్లలో ఎక్కువ శాతం రోడ్ల పనులు చేయలేదు. మడకశిర నియోజకవర్గంలో మంజూరైన 13 రోడ్లలో ఏ ఒక్కటి కూడా వేయకపోవడం గమనార్హం.

బిల్లుల పెండింగ్ వాస్తవమే...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఐయూ కింద జరిగిన పనుల బిల్లుల పెండింగ్ ఉన్న విషయం విస్తవమే. కాంట్రాక్టర్లు పని చేయడానికి ముందుకురావడం లేదు. కొన్ని ప్రాంతాలలో వేగంగా జరుగుతున్నాయి. బిల్లులు విషయం ప్రభుత్వానికి నివేదించాం. కొన్ని చోట్ల ఇతర నిధుల కింద రోడ్ల పనులు చేయడంతో సంబంధిత రోడ్ల పనులను రద్దు చేశాం. త్వరగా పనులు చేసే విధంగా చూస్తాం.

- వై. భాగ్యరాజ్, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ



2020లో కుందుర్పి మండలం అపిలేపల్లి-మండలపల్లి రోడ్డు పనుల శిలాఫలకం

మంత్రి ఇలాఖాలోనే దారుణం...

కళ్యాణదుర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టిన ఉష శ్రీచరణ్ నియోజకవర్గంలో కూడా రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీ రాజ్‌శాఖ పీఐయూ కింద కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఐదేళ్ల కిందట 29 తారు రోడ్లను మంజూరు చేయగా.. ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. కొన్ని ప్రాంతాలలో కొందరు కాంట్రాక్టర్లు రోడ్లు వేస్తుండగా.. బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. మంత్రి 2020లో ప్రారంభించిన కుందుర్పి మండలం కరిగానపల్లి నుంచి అపిలేపల్లికి వెళ్లే రహదారి పనులు పూర్తి కాలేదు. ఇప్పటికి ఈ రోడ్డు కంకర తేలి దర్శనిమస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా మంత్రి ఇలాఖాలోనే రోడ్ల పరిస్థితి పూర్తి దయనీయ స్థితిలో ఉండటం విమర్శలకు తావిస్తోంది. కాగా.. కళ్యాణదుర్గంలో అభివృద్ధి చేయలేని మంత్రి పెనుకొండను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీలు గుప్పిస్తూ 2024 ఎన్నికలకు ప్రచారం చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది.

కుందుర్పిలో కంకరదారులు..

కుందుర్పి మండలంలోని అపిలేపల్లి నుంచి మండలపల్లి వరకు, బండమీదపల్లి నుంచి తమ్మయ్యదొడ్డి, అక్కడి నుంచి శ్రీమజ్జనపల్లి వరకు తారు వేస్తామని ప్రకటించి.. పనులు మొదలు పెట్టారు. దారిని తవ్వి.. కంకర వేసి వదిలేశారు. గతంలో మట్టి రోడ్డే బాగుండేదని, నడిచి వెళ్లినా, ద్విచక్ర వాహనాల్లో వెళ్లినా ఇబ్బందులు ఉండేవి కాదని ఆ గ్రామాల ప్రజలు అంటున్నారు. కంకర దారిలో నడవలేక, వాహనాల్లో వెళ్లలేక నరక యాతన పడుతున్నామని వాపోతున్నారు. మండలంలోని గ్రామీణ రహదారులను బీటీ రోడ్లుగా మార్చే పనిని 2020 జనవరి ఒకటో తేదీన పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రారంభించారు. అపిలేపల్లి-మండలపల్లి రోడ్డుకు రూ.1.89 కోట్లు, అపిలేపల్లి-మండలపల్లి-బండమీదపల్లి రోడ్డుకు రూ.4.20 కోట్లు కేటాయించారు. ఈ పనులను కొంతమేరకు చేశారు. కానీ బిల్లులు మంజూరు కానందున అర్థంతరంగా వదిలేశారు. ఇవేకాదు, మండలవ్యాప్తంగా రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఎనుములదొడ్డి నుంచి తెనగల్లు, తెనగల్లు నుంచి అపిలేపల్లి వరకు దాదాపు 15 కి.మీ. దారి కంకర తేలింది. దీంతో ఆ రోడ్డు మీదుగా మండల కేంద్రానికి వెళ్లే వారు మరో మార్గంలో 20 కి.మీ. చుట్టేసుకుని వెళుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు సైతం ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది.

● ఉమ్మడి జిల్లాలో జిల్లాల వారిగా పరిస్థితి ఇలా...

● అనంతపురం జిల్లాలో...
నిధుల కేటాయింపు : రూ. 268 కోట్లు
మంజూరైన రోడ్లు : 138
పూర్తయిన రోడ్లు : 32
పనులు జరుగుతున్న రోడ్ల సంఖ్య : 38
రద్దయిన రోడ్లు : 03
పనులు ప్రారంభంకానీ రోడ్ల సంఖ్య : 65
పెండింగ్ బిల్లులు : రూ. 10.20 కోట్లు

● శ్రీ సత్యసాయి జిల్లాలో ...
నిధుల కేటాయింపు : రూ. 230.28 కోట్లు
మంజూరైన రోడ్లు : 194
పూర్తయిన రోడ్లు : 119
పనులు జరుగుతున్న రోడ్ల సంఖ్య : 21
రద్దయిన రోడ్లు : 02
పనులు ప్రారంభంకానీ రోడ్ల సంఖ్య: 52
పెండింగ్ బిల్లులు : రూ. 25.06 కోట్లు



కంకర వేసి వదిలేసిన కరిగానపల్లి-అపిలేపల్లి రోడ్డు



కంకర తేలిన తమ్మయ్యదొడ్డి రోడ్డు

మడకశిర నియోజకవర్గంలో అధ్వానం..

గత ప్రభుత్వం మడకశిర నియోజకవర్గం ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్ల అభివృద్ధికి దాదాపు రూ.వంద కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. ఇందులో మడకశిర ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.60 కోట్లు, నియోజకవర్గం పరిధిలో ఆరు రోడ్లకు రూ. 50 కోట్లు, కిరికెర మోర్‌బాగల్ వయా హేమావతి రోడ్డుకు రూ.20 కోట్లు కేటాయించారు. టెండర్లు పూర్తయ్యి పనులు ప్రారంభించారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో 25శాతంలోపు పనులు జరిగాయని వీటిని రద్దు చేశారు.

టీడీపీ హయాంలో చేసిన పనులే..


గత ప్రభుత్వం లో జరిగిన పనులే తప్ప ఈ మధ్య కాలంలో రోడ్డు విస్తరణకు సంబంధించి పనులు జరగలేదు. పంచాయితీ రాజ్ శాఖనుంచి ఆర్అండ్‌బీ పరిధిలోకి 258 కిలోమీటర్ల రోడ్లను బదలాయించారు. అందులో మడకశిర మండలంలో 70 కిలో మీటర్లు, అగళి మండలంలో 60 కిలోమీటర్లు, రొళ్ల మండలంలో 50 కిలోమీర్లు, గుడిబండ మండంలో 40 కిలో మీటర్లు, అమరాపురం మండలంలో 38 కిలోమీటర్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్నప్పుడు మెటల్ వేసి మట్టిని వేశారు. దీంతో ఆరోడ్లను అభివృద్ధి చేసేందుకు ఆర్అండ్‌బీ పరిధిలోకి తీసుకున్నారు. నేటికీ ఆ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆరోడ్లు వర్షాలకు దెబ్బతిని గుంతలమయం అయ్యాయి.

మరణించినా.. ఓటర్లే.. !

చనిపోయినా తుది ఓటరు జాబితాల్లో పేర్లు

తప్పుల తడకగా తుది ఓటరు జాబితా

గార్లదిన్నె, ఫిబ్రవరి 7: చనిపోయిన వారికి సైతం ఓటు హక్కు కల్పించిన ఘనత మండల అధికారులకు దక్కుతోంది. ఇటీవల విడుదల చేసిన తుది ఓటరు జాబితానే ఆవిషయాన్ని స్పష్టం చేస్తోంది. తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయడంలో అధికార యంత్రాంగం, బీఎల్ఓల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మండల వ్యాప్తంగా సుమారు 45291 మంది ఓటర్లు ఉన్నాయి. ఈసారి దాదాపు 5వేల మందికి పైగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో వివిధ గ్రామాల్లో చనిపోయిన వారితోపాటు డబుల్ ఎంట్రీ ఓట్లు, ఫొటో ఒకరిది అడ్రస్ మరొకరిది లాంటివి కూడా ఉన్నాయి. గార్లదిన్నెలో 49వ కేంద్రంలో సుమారు 10 మంది వరకు చనిపోయిన వారి ఓట్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. కేశవాపురం గ్రామంలో ఒకే వ్యక్తి ఫొటో డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయి.



మరణించినా జాబితాలో ఓటు



కేశవాపురంలో డబుల్ ఎంట్రీ

యాదవ కమ్యూనిటీ ఓట్లు ప్రత్యక్షం



వడ్రవన్నూరులో యాదవ కమ్యూనిటీ రెండు ఓట్లు

రాయదుర్గం: మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో యాదవ కులస్థుల ఓట్లు ప్రత్యక్షమైనట్లు టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో దళిత, కురుబ, వాల్మీకి కులస్థులు మాత్రమే జీవిస్తున్నారు. కానీ యాదవ కమ్యూనిటీకి చెందిన గొల్ల సంతోష్‌కుమార్ సన్నాఫ్ గొల్ల గంగాధర, గొల్ల యశోదమ్మ వైఫ్ ఆఫ్ గొల్ల మల్లేష్ అనే వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలోకి ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. బీఎల్ఓలు, వైసీపీ నాయకులు కలిసి దొంగ ఓట్లను చేర్చారనడానికి ఇదే నిదర్శనమన్నారు.

ఉత్తుత్తి డీఎస్సీ

ఉమ్మడి జిల్లాలో 386 ఖాళీలు... ఎస్‌జీటీ పోస్టులు 107 మాత్రమే..

ఉసూరుమనిపించిన వైసీపీ ప్రభుత్వం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 7: అనుకున్నట్లే జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లింది. నాలుగున్నరేళ్లకుగాపై ఊరించి.. ఎన్నికల ముందు కేవలం 386 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పూనుకుంది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఏనాడూ లేని విధంగా ఎస్‌జీటీ పోస్టులను భారీగా తగ్గించింది. ఒకేసారి టెట్, డీఎస్సీ నిర్వహిస్తుండటం, దరఖాస్తులు, పరీక్ష, ఫలితాలకు ఎలాంటి వ్యవధి ఇవ్వకుండా హడావుడి చేయడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల మందికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం 400 పోస్టులు కూడా భర్తీ చేయకపోవడంపై నిరుద్యోగులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

386 పోస్టులే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 386 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నారు. ఇందులో సెకెండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్ 164, టీజీటీ పోస్టులు 115 ఉన్నాయి. ఎస్‌జీటీ పోస్టులు పెద్ద ఎత్తున ప్రకటించేవారు. జిల్లాలో 195 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత అన్ని జిల్లాల నుంచి విద్యాశాఖాధికారులను కమిషనరేట్‌కు పిలిపించి, ఖాళీలపై కసరత్తు చేశారు. ఈ క్రమంలో జిల్లాలో ఖాళీలను 386కు పెంచారని తెలిసింది.

సమయం లేదు..

టెట్‌కు ఈ నెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలౌతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 23 నుంచి అభ్యర్థులకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయి. 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకూ టెట్ నిర్వహిస్తారు. మార్చి 14న ఫలితాలు ప్రకటిస్తారు. టెట్ క్వాలిఫై అయిన వాళ్లను డీఎస్సీకి అర్హులుగా ప్రకటిస్తారు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకూ రెండు విడతల్లో డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇలా.. మార్చి 14న టెట్ ఫలితాలు ప్రకటించి.. ఆ మరుసటి రోజే డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం ఏమిటని ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెట్ క్వాలిఫై అవుతారో లేదే తెలియకనే.. డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలన్నదే జగన్ ప్రభుత్వం వ్యూహం. దరఖాస్తుల రూపంలో కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని నిరుద్యోగులు మండిపడ్డారు.

ఎన్నికల కోసమే..



ఎన్నికల తరుణంలో జగన్ ప్రభుత్వం జిమ్మిక్కులు చేస్తోంది. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. టీచర్ కావాలనుకున్నవారు జగన్ ప్రభుత్వంలో కూలి పనులు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. కేవలం 6100 పోస్టులిస్తే లక్షలాది మంది నిరుద్యోగులు ఏం కావాలి..?

- లక్ష్మీనరసింహ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు

నిరుద్యోగులకు అన్యాయం..



నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాం. అదిగో.. ఇదిగో అంటూ టైం వేస్ట్ చేశారు. ఇప్పుడు హడావుడిగా టెట్, డీఎస్సీ ఒకేసారి విడుదల చేస్తున్నారు. జిల్లాలో మరీ తక్కువ పోస్టులిచ్చారు. డీఎస్సీ నోటిఫికేషన్ చూశాక నిరాశ కలుగుతోంది.

- మన్నల అనిత, డీఎస్సీ అభ్యర్థి

సీఎం ఆఫీస్ ముట్టడిస్తాం..



చదువు విలువ తెలియని వారిని పాలకులుగా ఎన్నుకున్నందుకు నిరుద్యోగులకు బాగా బుద్ధి చెప్పారు. మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను సీఎం జగన్ దగా చేశారు. మునుపెన్నడూ లేని విధంగా అతి తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్, టెట్, డీఎస్సీ షెడ్యూల్ అంతా బూటకం. 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇవ్వాలి. లేకుంటే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను, సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

23 వేల పోస్టులు భర్తీ చేయాలి



డీఎస్సీ కోసం కొన్నేళ్ల నుంచి సిద్ధమవుతున్నాం. వేల రూపాయలు ఖర్చు చేశాం. అధికారంలోకి రాగానే 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పుడు 6,100 పోస్టులు ఇస్తున్నారు. ఇది అన్యాయం. మా భవిష్యత్తుకు శరాఘాతమే. వెంటనే 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలి.

- కోమల, డీఎస్సీ అభ్యర్థి

వచ్చే వారంలో టిడ్కో ఇళ్ల ప్రారంభం



పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 7: తాడిపత్రిలోని 1,024 టిడ్కో ఇళ్లను వచ్చేవారంలో (11, 12 తేదీల్లో) ప్రారంభిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ బొమ్మాన ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. అనంతపురం నగర శివారుతో పాటు తాడిపత్రిలోని గన్నేవారిపల్లి సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. విడతల వారీగా టిడ్కో ఇళ్లను ప్రారంభిస్తున్నామన్నారు. మొదట తాడిపత్రి, ఆ తర్వాత అనంతపురం, ధర్మవరంలో టిడ్కో ఇళ్లను ప్రారంభిస్తామని అన్నారు. ఆయన వెంట టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఈఈ మల్లికార్జునప్ప, డీఈలు సాలన్న, షభాన, సిబ్బంది, కాంట్రాక్టర్లు ఉన్నారు.

10న సుప్రీంకోర్టు జడ్జి అనంతకు రాక

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 7: సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఆశానుద్దీన్ ఈనెల 10వతేదీన అనంతపురానికి వస్తున్నారని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జేఎన్‌టీయులోని ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో బార్‌కౌన్సిల్‌ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే వర్క్‌షాప్‌నకు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఆశానుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ఆయనతోపాటు పలువురు హైకోర్టు జడ్జిలు వస్తున్నారని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సిద్ధం సభ వాయిదా

18న నిర్వహణ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: జిల్లాలోని రాప్తాడు సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభను ఈనెల 18వతేదీకి వాయిదా వేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు సంబంధించి రాప్తాడులో ఈనెల 11న సభ నిర్వహించాలనుకున్నామని, అనివార్య కారణాలతో సభ వాయిదా వేశామన్నారు. షర్మిలకు భద్రత వారు సొంతంగా పెట్టుకోవాలని, ఆమెకు భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలైతే భద్రత ఇస్తారా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చినప్పుడు తమకు భద్రత తీసేశారన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించండి

ఎస్పీ అన్బురాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 7: జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలిచ్చారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జిల్లాలోని ఎస్ఐ, ఆపై స్థాయి పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ (యుఐ) కేసులు తగ్గించాలన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో జరిగిన నేరాలను సమీక్షించి ఆయా ప్రాంతాల్లో ఈసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని అందరు పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర చరిత్ర కలిగిన వారు, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు, గుర్తుతెలియని మృత దేహాల కేసులకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు త్వరగా ముగించి కోర్టుల్లో నంబర్లు తీసుకోవాలని సూచించారు. చీటింగ్ కేసులు, దొంగతనాల కేసుల ఛేదింపునకు కృషి చేయాలన్నారు. గంజాయి తరలింపుపై నిఘా ఉంచి, ఎక్కడా విక్రయాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగులకు తావుండకూడదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, డీఎస్పీలు శ్రీనివాసులు, సీఎం గంగయ్య, శివభాస్కర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి, మునిరాజా, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన నిద్రమత్తు

కంటైనర్ బోల్తా.. ఇద్దరు కూలీలు, 40 ఆవులు మృతి



బోల్తా పడ్డ కంటైనర్



శ్రీనివాసులు, ఈశ్వరరావు మృతదేహాలు

తాడిపత్రి, ఫిబ్రవరి 7: పెద్దవడుగూరు మండల పరిధిలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద పశువులను తరలిస్తున్న కంటైనర్ బోల్తా పడటంతో ఇద్దరు కూలీలు మృతిచెందారు. కంటైనర్‌లో ఉన్న సుమారు 40 ఆవులు మృతిచెందాయి. మరో పది ఆవులు, పది ఎద్దులు గాయపడ్డాయి. బెంగళూరు - హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం నుంచి కంటైనర్‌లో 60కిపైగా ఆవులు, ఎద్దులను అక్రమంగా బెంగళూరు వైపు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కంటైనర్ అదుపుతప్పి.. రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టి బోల్తా పడిందని వారు తెలిపారు. మృతులను విశాఖపట్నం జిల్లా దేవవరం గ్రామానికి చెందిన ఈశ్వరరావు (45), శ్రీకాకుళం జిల్లా పంగవానిపేట గ్రామానికి చెందిన శ్రీనివాసులు(46)గా గుర్తించారు. వీరిద్దరూ పశువులతోపాటు కంటైనర్‌లో ఉండటంతో వాటి కిందపడి మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌తోపాటు క్యాబిన్‌లో ఉన్న ముగ్గురు పారిపోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కంటైనర్‌లో ఇరుక్కుపోయి, గాయపడ్డ ఆవులు, ఎద్దులను బయటకు తీయించారు. గుత్తి పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. మృతిచెందిన ఆవులు, ఎద్దులకు గుత్తి పశువైద్యశాలలో పోస్టుమార్టం చేయించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే బీజేపీ జిల్లా నాయకులు ప్రమాద స్థలానికి వెళ్లారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎక్కడా రాజీపడకండి

ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలి

విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

ఎన్నికల అధికారులకు శిక్షణలో కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 7: ఎన్నికల నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా నిబంధనల మేరకు ముందుకుసాగాలని అధికారులకు కలెక్టరు గౌతమి సూచించారు. బుధవారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఎన్నికలపై సెక్టోరియల్ అధికారులు, పోలీసు అధికారులతో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్రే కీలకమని, ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన వసతులు ఉండేలా చూడాలన్నారు. ఫర్నిచర్, తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు ఉండేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్‌కేంద్రం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండేలా చూడాలని సూచించారు. ఏ పోలింగ్‌కేంద్రాలలో ఓటువేయాలో ఓటర్లకు ముందే తెలపాలన్నారు. మూడుసార్లు పోలింగ్‌కేంద్రాలను తనిఖీ చేయాలని, ఆ రిపోర్టులను పెట్టాలన్నారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్‌రోజు ఎలా ఉండాలో వాటిగురించి అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలలో ఓటింగ్ వేసేవిధానంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. పోలింగ్‌శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికి అప్పగించిన బాధ్యతను వారు చిత్తశుద్ధితో చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల నిఘా పెంచాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎక్కడా చిన్నసమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓలు, జడ్పీసీఈఓ, నగరపాలక కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

ఎర్రచందనం స్మగ్లర్ల అణచివేతపై
ప్రభుత్వం నిర్లక్ష్యం

- అందుకే కానిస్టేబుల్ గణేశ్ ప్రాణాలు కోల్పోయారు
- మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి
- బీకే పార్థసారథితో కలిసి నివాళులర్పించిన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఫిబ్రవరి 7: ఎర్రచందనం స్మగ్లర్ల అణిచివేతపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అందుకే నేడు ఒక కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ విమర్శించారు. అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు వాహనంతో ఢీకొట్టిన మృతి చెందిన సంఘటన ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్ భౌతికకాయాన్ని స్వగ్రామమైన పట్టణంలోని గుట్టకిందపల్లికి బుధవారం తీసుకొచ్చారు. పరిటాలశ్రీరామ్‌తో పాటు టీడీపీజిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి వెళ్లి ఆ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి.. గణేశ్‌భార్య అనూషకు రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... ఎర్రచందనం స్మగ్లర్లను నియంత్రించడానికి గణేశ్ ఎంతో సాహసోపేతంగా వ్యవహరించారని కొనియాడారు. ప్రకృతి సంపద స్మగ్లర్ల చేతిలోకి వెళ్లకూడదన్న గణేశ్ ప్రయత్నం మీద ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గతంలో ఎర్రచందనం స్మగ్లర్ల మీద ప్రత్యేక నిఘా ఉండేదని, ఐజీ స్థాయి అధికారితో నిత్యం పర్యవేక్షణ కూడా ఉండేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అలాంటి చర్యలు కనిపించడం లేదన్నారు. అందుకే తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎర్రచందనం స్మగ్లర్లపై వార్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గణేశ్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గణేశ్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.



గణేశ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్, బీకే పార్థ సారధి

వైసీపీ పాలనలో పోలీసులకూ రక్షణ లేదు

- మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల
- మృతుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

ధర్మవరం: వైసీపీ అరాచకపాలనలో ప్రజలకే కాదు పోలీసులకు కూడా రక్షణ లేకుండాపోయిందని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని గుట్టకింద పల్లిలో ఏఆర్ కానిస్టేబుల్ బిల్లే గణేశ్ భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. గణేశ్ భార్య అనూషకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎర్రచందనం స్మగ్లర్లను అడ్డుకునేందుకు వెళ్లిన కానిస్టేబుల్ గణేశ్‌ను కారుతో గుద్ది చంపడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు పూర్తిగా రక్షణ ఉండేదన్నారు. గణేశ్ భార్యకు ఉద్యోగం ఇస్తూ.. పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని, అదేవిధంగా 10 సెంట్ల స్థలంతోపాటు కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డిష్ రాజు, అరవిందరెడ్డి, చిలకం సూర్యనారాయణ రెడ్డి, బోడగల గిరిధర్, దుస్సా కృష్ణ, సరితాల దస్తగిరి, నారాయణ స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేయండి: కలెక్టర్

ధర్మవరం, ఫిబ్రవరి 7: ఎన్నికల నిర్వహణ సన్నాహాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. పట్టణంలో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా గుట్టకింద పల్లిలో మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. ఈవీఎం, ఎన్నికల సామగ్రి పంపిణీకి ఈ మోడల్ స్కూల్ అనువుగా ఉందని అధికారులకు తెలియజేశారు. ఈ మోడల్‌స్కూల్ నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతోపాటు ఎన్నికల సామగ్రిని పంపాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటశివారెడ్డి, తహసీల్దార్ రమేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, సర్వేయర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్నిపోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అనుకూలంగా ఉండేవిధంగా చర్యలుతీసుకోవాలన్నారు. తర్వాత మారుతీనగర్, లక్ష్మీచెన్నకేశవపురం సచివాలయ కేంద్రాలకు వెళ్లి అక్కడ సచివాలయ వ్యవస్థకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని సూచించారు.


లక్ష్మీచెన్నకేశవపురంలో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయండి

పుట్టపర్తి: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 253గ్రామాల్లో 34,353మందికి ఇంటిపట్టాలు మంజూరు చేశారని, వీటికి ఇంతవరకు సచివాలయాల్లో 5,285మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు ఆయా పరిధిలోని వార్డు సచివాలయాలను సందర్శించి రిజిస్ట్రేషన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే కులగణన వేగవంతం చేయాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడి: డీఎంహెచ్ఓ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి7: ఫ్యామిలీడాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి వైద్యసిబ్బంది సూచించారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో బుధవారం చేపట్టిన ఫ్యామిలీడాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇందులోభాగంగా ఎఫ్‌డీసీ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలు గురించి ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియాసాల్మన్, దర్శినమల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, జయదుర్గ, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో మడకశిర మున్సిపల్ కమిషనర్ మృతి

కదిరి, ఫిబ్రవరి 7: మడకశిర మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ (55) బుధవారం కదిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుండెపోటుతో మృతిచెందారు. మడకశిర నుంచి కోర్టు పని మీద రాయచోటికి వెళ్లడానికి ఆయన కదిరి బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్నారు. అయితే హఠాత్తుగా కుప్పకూలి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.


ప్రభాకర్, (ఫైల్)

ఈపంట నమోదు తప్పనిసరి

నల్లమాడ, ఫిబ్రవరి 7: మండల వ్యాప్తంగా రబీలో పంటలు సాగుచేసిన రైతులందరూ ఈపంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి వైవీ సుబ్బారావు సూచించారు. మండలంలోని చారుపల్లి పంచాయతీలో చేపడుతున్న ఈపంట నమోదును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రబీలో పండిస్తున్న పంటలకు తప్పకుండా ఈపంట నమోదు చేయించాలన్నారు. ఈనెల 15వ తేదీలోపు రైతులందరూ ఈపంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈపంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వ రాయితీలు వర్తించవని తెలిపారు. ఆయన వెంట ఏఓ సుమతి, రైతు భరోసా కేంద్రం సహాయకులు ఉన్నారు.

రైతు ఆత్మహత్యపై కమిటీ విచారణ

కదిరి, ఫిబ్రవరి 7: అమడగూరు మండలంలోని మలకవారిపల్లి తండాలో రైతు మురళీ నాయక్ ఆత్మహత్య చేసుకోవడంపై బుధవారం కమిటీ విచారణ చేపట్టింది. ఈకమిటీలో కదిరి ఆర్డీవో వంశీకృష్ణ, ఏడీఏ సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఏఓ వెంకటరమణాచారి విచారణ చేపట్టారు. గ్రామంలోకెళ్లి రైతు జీవన విధానంపై ఆరా తీశారు. పంటల సాగుకు రైతు చేసిన అప్పులపై వివరాలడిగి తెలుసుకున్నారు మృతుడి భార్య, పిల్లలతో అధికారులు మాట్లాడారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

చేనేత పరిశ్రమను ప్రభుత్వాలు ఆదుకోవాలి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి7: చేనేత పరిశ్రమను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శివానగర్‌కు చెందిన చట్టారవివర్ధన్, చెన్నంపల్లిశ్రీనివాసులు, విజయ్‌భాస్కర్‌తో పాటు పలు కుటుంబాల వారు బుధవారం సీపీఐలోకి చేరారు. వారిని మధు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ చేనేత కార్మికులు నేసినచీరలకు గిట్టుబాటు ధర లేక అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చేనేత పరిశ్రమను కాపాడాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బత్తలపల్లి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో ముస్లింలకు పరిటాల రవీంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన బోరుకు బుధవారం మోటారు బిగించి ప్రారంభించారు. బత్తలపల్లి శివారు ప్రాంతంలో ముస్లింలు గత రెండేళ్లుగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందిని స్థానిక నాయకులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అయన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవలనూతనంగా బోరు వేయించారు. ప్రస్తుతం మోటారు బిగించి ప్రారంభింపజేశారు. దీంతో ఆ ప్రాంతలో నీటి సమస్య తీరింది. మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లాశ్రీనివాసులు, జక్కంపూటినాగభుషణ, తాళ్లూరి సతీష్ పాల్గొన్నారు.

ధర్నాకు వెళ్లకుండా ఆశా వర్కర్లకు నోటీసులు

ముదిగుబ్బ, ఫిబ్రవరి7: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి ఆశా వర్కర్లు వెళ్లకుండా మండలకేంద్రంలోని పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. జీతం పెంపుదల, పని భారం తగ్గించాలంటూ చేపట్టిన ధర్నాకు ఆశా వర్కర్లను వెళ్లనీయకుండా, ముందస్తు చర్యగా బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో పోలీసులు నిఘా పెట్టారు.

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ రద్దు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 7: ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీలలో ఇద్దరివి రద్దు చేశారు. పెద్దవడుగూరు మండల తహసీల్దార్ నాగభూషణంను నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. కడప కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న తహసీల్దార్ విజయకుమార్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిద్దరి వయసూ ఉద్యోగ విరమణకు దగ్గర ఉండటంతో బదిలీని రద్దు చేసి, పూర్వపు స్థానాల్లోనే ఉండేలా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇద్దరినీ ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కడప జిల్లా ఓబులవారిపాలెం మండల తహసీల్దార్ పుల్లారెడ్డిని శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 7: వన్‌స్టాప్ ఉన్న ఐసీడీఎస్ కేంద్రాలలో ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ అనుబంధంలో ఉన్న నిర్ణీత ప్రొఫార్మాలో 15వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హతను బట్టి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను hittps/ srisatyasaiap.gov.in లో డౌన్‌లోడ్ చేసుకుని కార్యాలయానికి అందించాలన్నారు. కాంట్రాక్టు బేసిక్‌పైన ఆఫీస్ అసిస్టెంట్, సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్, పారాలీగల్, పారామెడికల్ పర్సనల్, సోషల్ కౌన్సిలర్ ఒకటి చొప్పున, కేసు వర్కర్ 2, మల్టీపర్పస్ స్టాఫ్, సెక్యూరిటీ నైట్‌గార్డు 3 చొప్పున పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యాలయంలో కానీ, ఆన్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలని పీడీ సూచించారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

నంబులపూలకుంట, ఫిబ్రవరి 7: బీజేపీ మండల నూతన కమిటీని ఎన్నిక చేసినట్లు మోనార్టీ మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు షేక్‌బాబ్‌జాన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పెడబల్లిరోడ్డులో బుధవారం ఆయన పార్టీకార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడే మండల కమిటీని ఎంపిక చేసి నియామక పత్రాలు అందించారు. మండలాధ్యక్షుడిగా చంద్రమోహన్‌రెడ్డి,ఉపాధ్యక్షులుగా చలపతి, నరసింహారెడ్డి, నాగార్జున, కుమార్ నాయుడు, కదిరిరెడ్డి, రామాంజులరెడ్డి, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, నాగార్జున, సుధాకర్ రెడ్డి, వెంకటచలపతి, శ్రీనివాసులు, ఖలీల్, రమణయ్య, వెంకటరమణను ఎన్నికచేశారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా కార్యదర్శిగా తాజుద్దీన్, యువ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

కొత్తచెరువు, ఫిబ్రవరి 7: మండలకేంద్రానికి చెందిన విద్యార్థి మణిదీప్(20) కర్ణాటకలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకెళ్తే.. కొత్తచెరువుకు చెందిన కురుబ నాగేంద్ర కుమారుడు మణిదీప్ కర్ణాటక రాష్ట్రంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా ఇటీవల జరిగిన పరీక్షల్లో మూడు సబ్జెక్టులు తప్పాడు. ఇందుకు మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు వచ్చారని హాస్టల్ నుంచి బయటికి వెళ్లాడు. అదే సమయంలో దొడ్డబళ్లాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి మెడలోని ఐడీ కార్డు ఆధారంగా స్థానికులు యూనివర్సిటీకి సమాచారం అందించారు. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థి తల్లితండ్రులకు సమాచారం చేరవేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పొస్టుమార్టానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బత్తలపల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని రాఘవంపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముష్టూరు గ్రామానికి చెందిన నాగభూషణ, శివమ్మల చిన్న కుమారుడు హర్షవర్ధన్ (20) డ్రైవర్‌గా పని చేసేవాడు. కాగా బుధవారం సాయంత్రం బత్తలపల్లికి మిత్రుడి జన్మదిన వేడుకలకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. వేడుక అనంతరం రాత్రి సమయంలో స్వగ్రామానికి తిరిగి బయలుదేరాడు. మార్గంమధ్యలోని రాఘవంపల్లి క్రాస్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తర్వాత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాబు సీఎం కావాలి.. పల్లె ఎమ్మెల్యే కావాలి..

ఆలయాల్లో టీడీపీ శ్రేణుల పూజలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 7: టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వాలని, పుట్టపర్తి నియోజకవర్గానికి పల్లె రఘునాథ రెడ్డి ఎమ్మెల్యే కావాలంటూ ఆ పార్టీ నాయకులు పట్టణంలోని సత్తెమ్మ ఆలయంలో బుధవారం పూజలు చేశారు. 116 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సైకో పోవాలి.. సైకిల్ రావాలి, బాబు సీఎం కావాలి.. పల్లె పుట్టపర్తి ఎమ్మెల్యే అవ్వాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, కోనంకి గంగాధర్, దయ్యాల ఉమాపతి, సుబ్రమణ్యం, షామీరు, మనోహర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం/ నల్లమాడ: టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కావాలని, పుట్టపర్తి నియోజకవర్గంలో పల్లె రఘునాథ రెడ్డి గెలవాలని కోరుతూ బుక్కపట్నంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పార్టీ మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు బాలు, రామక్రిష్ణ, సూరి, వాజిద్, సయ్యద్, బాలాజీ, జయరాం, సంజీవరాయుడు, గంగాధర్, సాకే యశోద పాల్గొన్నారు. నల్లమాడలోని సత్యమ్మకు మండల శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, పుట్టపర్తి నియోజకవర్గంలో పల్లె రఘునాథరెడ్డి గెలవాలని ప్రత్యేక పూజలుచేశామన్నారు. అమ్మవారికి 101 టెంకాయలుసమర్పించి, ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు వెంకటరమణ నాయుడు, సలాంఖాన్, బుట్టినాగభూషణనాయుడు, శివప్రసాద్‌రెడ్డి, మణికుమారి, పుట్ల రవీంద్ర, మైలే రామచంద్ర, పాపారాయుడు పాల్గొన్నారు.


పుట్టపర్తిలోని సత్తెమ్మ ఆలయం ఎదుట టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. 101 టెంకాయిలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె రఘునాథ రెడ్డి గెలవాలని కోరుతూ పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఎంపీ జాకీర్, బూదిలి ఓబులరెడ్డి, షేక్ నిజాం, మండోజీ ఆర్బీఖాన్, షబ్బీర్, ఇర్షాద్, పీట్ల సుదార్, జెరిపిటి ఆంజనప్ప, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, షాన్వాజ్, మస్తానమ్మ, అఖిల, సొదీ నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా తయారుచేయాలి

ధర్మవరం, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలో ఓటరు జాబితా తప్పులతడకగా తయారు చేశారని, అధికార పార్టీ నాయకులు చేర్పించిన దొంగ ఓట్లను తొలగించకుండా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆరోపించారు. దొంగ ఓట్ల అంశాన్ని ఆర్డీఓ వెంకటశివారెడ్డి దృష్టికి ఆయన బుధవారం తీసుకెళ్లారు. నియోజకవర్గంలో చాలాచోట్ల వైసీపీ దొంగ ఓట్లను చేర్పించిందని, దీనిపై విచారణ జరిపి తొలగించాలని డిమాండ్‌చేశారు. నకిలీ ఓట్ల వివరాలను ఆధారాలతో సహా ఆర్డీఓకు నివేదించారు. పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఓటరు జాబితాను మరోసారి పరిశీలించి పారదర్శకంగా తయారు చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

పేదలకు అన్నదానం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 7: జిల్లాకేంద్రంలోని హనుమాన్‌కూడలిలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బుధవారం పేదలకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు రోజూ అన్నదానం చేపడతామన్నారు. వైసీపీ ప్రభుత్వం మూసివేయించిన అన్నాక్యాంటీన్లను టీడీపీ అధికారంలోకి రాగానే తిరిగి ప్రారంభిస్తామన్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

గాండ్లపెంట, ఫిబ్రవరి 7: మండలకేంద్రంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్లో గురువారం జయహో బీసీ సదస్సు జరగనుందని, మండలంలోని బీసీలు, టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ కొండయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి హాజరు కానున్నట్లు చెప్పారు.

ధర్మవరంలో టీడీపీ జెండా ఎగురవేస్తాం: పరిటాల శ్రీరామ్


వెంకటతిమ్మాపురంలో పార్టీలోకి చేరిన వారితో పరిటాలశ్రీరామ్



ధర్మవరం 38వ వార్డులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ శ్రేణులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి7: వచ్చే ఎన్నికల్లో ధర్మవర నియోజకవర్గంలో ఖచ్చితంగా టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి, నడిమిగడ్డపల్లి, బలిజమడితండా గ్రామాల్లో బుధవారం టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పరిటాల శ్రీరామ్ పాల్గొని వారితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ఎవరెవరి ఏయే పథకాలు వర్తిస్తాయి.. ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కావాలంటే చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. ఈ సారి ధర్మవరంలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌చౌదరి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, మండలకన్వీనర్ పోతుకుంటల క్రిష్ణ, నాయకులు మహేష్‌చౌదరి, గొట్లూరుశ్రీనివాసులు, విజయ్‌సారథి, జంగంనరసింహులు, భాస్కర్‌చౌదరి, అశ్వత్థనాయుడు, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, నారాయణస్వామి, మల్లికార్జున, చెన్నకేశవులు, చంద్రాయుడు, నారాయణస్వామి, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక..

వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన గోవిందు, నారాయణస్వామితో పాటు మరో పది కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారందరికి పరిటాలశ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

38వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరం: పట్టణంలో 38వ వార్డులో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతిఇంటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. ఈ మేరకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య, నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, రాళ్లపల్లిషరీఫ్, జిలకర శీనా, గోసల శ్రీరాములు, అత్తర్ రహీంబాషా, మాధవరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మందుల పంపిణీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 7: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మందులను ఎంపీడీఓ ధనలక్ష్మి, వైద్యాధికారి కమల్ రోహిత్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ముందస్తుగా మందులను సిబ్బందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలలు, అంగన్‌వాడీల్లో 9,970మంది విద్యార్థులకు వాటిని వేయనున్నట్లు చెప్పారు.

పట్నం ఎస్ఐగా నరసింహులు

ముదిగుబ్బ, ఫిబ్రవరి7: ముదిగుబ్బ సర్కిల్ పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా నరసింహులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్ఐ ఇషాక్ బాషా బదిలీకావడంతో.. ఆయన స్థానంలోకి బుక్కపట్నం నుంచి నరసింహులు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీరాముడి కల్యాణోత్సవంపై ప్రచారం

తనకల్లు, ఫిబ్రవరి 7: అయోధ్యరాముడి కల్యాణానికి తరలి రావాలని సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార రథయాత్ర బుధవారం మండలంలోని చెక్కవారిపల్లి, కొక్కంటి, కోర్తికోట, కొక్కంటి క్రాస్‌లో కొనసాగింది. కొక్కంటి క్రాస్‌లో రథయాత్ర ముందు భజన బృందాలు శ్రీరామ కీర్తనలను ఆలపిస్తూ ప్రచారం చేపట్టారు. ఈనెల 21న కదిరి పట్టణంలోని బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమానికి ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు రానున్నట్లు చెప్పారు.

ఎస్పీని కలసిన సీఐ శివప్రసాద్

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 7: రామగిరి సీఐగా బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్ బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే బుక్కపట్నం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నరసింహులు కూడా ఎస్పీని కలిశారు.

రైతు సంఘం ధర్నా విజయవంతం చేయండి

నల్లమాడ, ఫిబ్రవరి 7: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుచ్చెపు చంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈధర్నాకు జిల్లాలోని ప్రతి రైతు, కౌలు రైతులు పాల్గొనాలని కోరారు.

బీసీలకు జగన్ చేసిందేమీలేదు

- జయహో బీసీలో పర్వీన్ బాను

తనకల్లు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో బీసీలకు సీఎం జగన్ చేసిందేమీ లేదని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌బాను విమర్శించారు. మండలకేంద్రంలోని ఎస్ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం జగన్ అధికారం చేపట్టాక రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేపట్టావా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఒక్క కార్పొరేషన్‌కైనా రూపాయి నిధులు విడుదల చేశారా అని అన్నారు. బీసీలంటే బ్యాక్‌బోన్ అంటూ నినాదాలు ఇవ్వడం కాదని, బీసీల అభ్యున్నతికి ఏమి చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల సిద్ధం.. సిద్ధం అంటున్నారే.. దేనికి సిద్ధమని నిలదీశారు. మహిళలు తాళిబొట్లు తెంచడానికి, రైతుల ఊసురు తీయడానికా, పేదల పొట్ట కొట్టడానికా.. దేనికి సిద్ధమని దుయ్యబట్టారు. టీడీపీ పాలనలో బీసీల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, ఇందుకు రూ.కోట్లు నిధులు వెచ్చించారని గుర్తు చేశారు. తర్వాత పలువురు బీసీ నాయకులు ప్రసంగిస్తూ టీడీపీతోనే బీసీలకు గౌరవం లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు వహీద్, బీసీ జిల్లా నాయకుడు రంగయ్య, మండల కన్వీనర్ తొట్టి రెడ్డిశేఖర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ శంకర్‌నాయుడు, వడ్డెర్ల సంఘం అధ్యక్షులు రవిచంద్ర, మైనార్టీ నాయకులు అహమ్మద్‌వలీ, ఆయూబ్, దస్తగిరి, మహబూబ్‌బాషా, మాజీ ఎంపీటీసీ రమణయ్య, మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, మహిళా నాయకురాళ్లు శోభా, సరోజమ్మ, సీనియర్ నాయకులు నాగేంద్రప్రసాద్, దేశాయి ప్రభాకర్‌రెడ్డి, జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తనకల్లులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

కదిరి: టీడీపీతోనే బీసీలు అభ్యున్నతి చెందారని ఆ పార్టీ కదిరి పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, రూరల్ కన్వీనర్ చెన్నకేశవులు, నియోజకవర్గ పరిశీలకులు వహీద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం బీసీల కోసం పలురకాల సంక్షేమపథకాలు, కార్పొరేషన్లు పెట్టిందన్నారు. వైసీపీ వచ్చాక బీసీలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అధ్యక్షుడు కుట్టిమద్ది రంగయ్య, పర్వీన్‌భాను, బాబ్‌జాన్, శ్రీరాములు, నాగప్ప, డక్కానాచారి, గంగయ్య, నారాయణస్వామి సురేంద్ర, పాండురంగప్ప, నాగభూషణం, ఆఫీజ్, అక్రమ్, గంగులప్ప, క్రిష్ణమూర్తి, సావిత్రమ్మ, రమణ, మోపూరి శెట్టి చంద్రశేఖర్, మనోహర్‌నాయుడు, శంకర్, రెడ్డెప్ప పాల్గొన్నారు.


కదిరిలో ఐక్యత చాటుతున్న టీడీపీ నాయకులు , బీసీలు

10 నుంచి వీరక్యాతమ్మ ఉత్సవాలు



మడకశిర రూరల్, ఫిబ్రవరి 7: మండలంలో ప్రసిద్ధి చెందిన కల్లుమర్రి వీరక్యాతమ్మదేవి ఉత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. 10న కలశపూజ, ధ్వజారోహణ, జ్యోతుల ఉత్సవం, కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 11న అభిషేకాలు, తోమాలసేవ, నాగదేవత హోమం, చండీయాగం, రథాంగహోమం, మధ్యాహ్నం 1 గంటకు బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారిని గజవాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయకమిటీ తెలిపింది.

ముగిసిన కొల్హాపురమ్మ ఉత్సవాలు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్థులు

అగళి, ఫిబ్రవరి 7: మండలంలోని కోడిపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న రత్నగిరి కొల్హాపురి మహాలక్షి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. అమ్మవారిని గ్రామంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్లి వడిబియ్యం కట్టించుకుని ఆశీర్వాదం పొందారు. అనంతరం అమ్మవారిని ఆమె స్వగ్రామమైన రొళ్ల మండలంలోని రత్నగిరికి తీసుకెళ్లారు. దాదాపు 40సంవత్సరాల కిందట కోడిపల్లిలో కొల్హాపురి అమ్మవారి ఉత్సవాలు జరిగాయని గ్రామస్థులు తెలిపారు. మరలా ఇప్పుడు గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిసినట్లు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కును అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

గుడిబండ, ఫిబ్రవరి 7: మండలకేంద్రంలోని లక్ష్మీదేవి ఆలయాభివృద్ధికి ధర్మస్థల మంజునాథ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. గుడిబండలో బుధవారం ఆలయ కమిటీ సభ్యుడు నాగరాజుకు ధర్మస్థల మంజునాథ గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ సభ్యులు నరేష్, సూపర్‌వైజర్ మను, గుడిబండ సర్పంచ్ కరుణాకర్ విరాళం అందించారు. లక్ష్మీదేవి ఆలయ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రొద్దం: మండలపరిధిలోని సానిపల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి స్థానిక ఎంపీ యూపీ పాఠశాల ఉపాధ్యాయులు రూ.40వేలు విరాళా న్ని అందించారు. సానిపల్లి గ్రామ పెద్దలు రమేష్, శంకర‌రెడ్డికి దానిని ఉపాధ్యాయులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపధ్యాయుడు చంద్రశేఖర‌గౌడ్, కృష్ణానాయక్, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

విద్యుత్‌స్తంభం పైనుంచి పడి వర్కర్‌కు తీవ్రగాయాలు

గోరంట్ల, ఫిబ్రవరి 7: మండలంలోని పుల్లేరు గ్రామంలో బుధవారం విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి మరమ్మతులు చేస్తూ స్తంభంపై నుంచి కింద పడిన సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. పుల్లేరు గ్రామానికి చెందిన చిన్నప్పయ్యకుమారుడు సురేష్ విద్యుత్ శాఖ అధికారుల వెంట సహాయకుడిగా పనిచేస్తూ, అవసరమైన చోట్ల మరమ్మతులు చేసేవాడు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ ఇంటికి విద్యుత్ సమస్య ఏర్పడడంతో విద్యుత్ శాఖాధికారుల అనుమతి లేకుండానే సురేష్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడడంతో అతడి తలకు, కుడిచేయికి తీవ్రగాయాలయ్యాయి. విద్యుత్ షాక్ వలన ప్రమాదం జరిగిందా లేక పట్టుతప్పడంతో కిందపడ్డాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. అతడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ఉష చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సలహా మేరకు బెంగళూరుకు తరలించారు. ఈ సంఘటనపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులను వివరణ కోరగా.... విద్యుత్ శాఖాధికారుల అనుమతిలేకుండా సురేష్ పుల్లేరులో మరమ్మతులు చేయడానికి విద్యుత్ స్తంభం ఎక్కాడన్నారు. పైనుంచి జారి పడ్డాడని తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

హిందూపురం, ఫిబ్రవరి 7: పట్టణ పరిధిలోని కొట్నూరు కట్టపై లారీ ఢీకొని ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న మారుతి(19) అనే యువకుడు దుర్మరణం చెందినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. రొద్దం మండలం చోళేమర్రికి చెందిన రంగనాథ్ రెండో కుమారుడు మారుతి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం స్వగ్రామం ద్విచక్రవాహనంలో స్నేహితుడు మంజునాథ్‌తో కలిసి మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేసుకునేందుకు పెనుకొండకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని పరిగి మండలం కొడిగెన హళ్ళికి హిందూపురం మీదుగా వెళ్తున్నారు. కొట్నూరు కట్టపైకి వచ్చే సరిగి వెనకవైపు వస్తున్న లారీ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. మంజునాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన మంజునాథ్‌ను స్థానికులు ద్విచక్రవాహనంలో తీసుకొచ్చారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా: గుండుమల



సమావేశానికి హాజరైన అధికారులు, వివిధ పార్టీల నాయకులు

మడకశిర టౌన్ , ఫిబ్రవరి7: మడకశిర నియోజకవర్గంలో తప్పుల తడకగా ఓటర్ల జాబితా ఉందని, అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకొచ్చినా అందులో మార్పులేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికలకు సంబంధించి అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి.. ఆర్‌ఓ గౌరీ శంకర్‌రావు దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా అవకతవకలపై వివరించారు. ఇప్పటికే మరణించినవారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలని, ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీతోపాటు ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ ఓట్లు నమోదు అయిన విషయాలను అధికారుల దృష్టి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆర్‌ఓకు వివరించారు. తమరైనా వెంటనే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఓటరు జాబితాలోని అవకతవకలను సరిచేయాలని ఆయన ఆర్‌ఓను కోరారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల కోసం భవనాల పరిశీలన



మడకశిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మడకశిర, జనవరి 30 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మడకశిర నియోజకవర్గానికి సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భద్రపరిచేందుకు మడకశిర ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో పలు భవనాలను జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు బుధవారం పరిశీలించారు. మడకశి ర నియోజకర్గానికి సంబంధించి రిసెప్షన్ సెంటర్, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూంల ఏర్పాటుకు ఆయన కళాశాలలను సందర్శించారు. ఆయా భవనాల్లో వసతులు, తాగు నీరు, మరుగు దొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. రహ దారి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లపై స్థానిక అధికా రులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, మడకశిర నియోజకవర్గం ప్రత్యేకాధికారి గౌరీశంకర్ రావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

హిందూపురం అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూంలను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం పరిశీలించారు. స్థానిక ఎంజీఎం పాఠశాలలో భవనాలను, అందులో వసతులు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం తదితర విషయాలు పరిశీలించారు. ఆయన వెంట జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ, డీఎస్పీ

చిలమత్తూరు: త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మండలం లోని పలు చోట్ల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సెక్టార్ 30లో ఉన్న పోలింగ్ కేంద్రాలు 204, 205, శెట్టిపల్లి, పెద్దన్నపల్లి, కోడూరు, కోడూరు తోపు, మధురేపల్లిలో పరిశీలించారు. సెక్టార్ 29, 25, 26, 27, 16 లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, బీఎల్‌ఓలు ఉన్నారు.

గోరంట్ల: మండలంలోని పుల్లేరు కొండాపురం, బూదిలి, గుమ్మయ్యగారిపల్లి, బూడిదగడ్డపల్లి, గోరంట్లలోని బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పెనుకొండ డీఎస్పీ ఎస్‌కే బాజీజాన్‌సైదా బుధవారం పరిశీలించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తుండడంతో మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతి, చేపట్టాల్సిన చర్యలు, భద్రత ఏర్పాట్లుపై ఆయన పరిశీలించి, అధికారులతో చర్చించారు. ఆయనతోపాటు సీఐ సుబ్బరాయుడు, పోలీస్ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇద్దరు తహసీల్దార్ల బదిలీ రద్దు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 7: ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీలలో ఇద్దరివి రద్దు చేశారు. పెద్దవడుగూరు మండల తహసీల్దార్ నాగభూషణంను నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. కడప కలెక్టరేట్‌లో ఏఓగా పని చేస్తున్న తహసీల్దార్ విజయకుమార్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిద్దరి వయసు ఉద్యోగ విరమణకు దగ్గర ఉండటంతో బదిలీని రద్దు చేసి, మునుపటి స్థానాల్లోనే ఉండేలా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇద్దరినీ ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కడప జిల్లా ఓబులవారిపాలెం మండల తహసీల్దార్ పుల్లారెడ్డిని శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

గ్రంథాలయ పన్ను బకాయిలు చెల్లించండి

గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 7: గ్రంథాలయ పన్ను బకాయిలు సత్వరమే చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ నగర పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె పెనుకొండలోని నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పన్ను బకాయిలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పెనుకొండ నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఇంటి పన్నును నగర పంచాయతీ అధికారులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి పన్నుల్లో ఎనిమిది శాతం గ్రంథాలయానికి కట్టాల్సి ఉందన్నారు. నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి గ్రంథాలయానికి రూ.8లక్షలకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని వెంటనే మునిసిపల్ అధికారులు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రొద్దం: మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ బుధవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాధికారి నాగరాజుకు సూచించారు. గ్రంథాలయానికి విరాళాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

గోరంట్ల: పట్టణంలోని హిందూపురం రహదారిలో ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు బుధవారంఢీకొన్న సంఘటనలో వెంకటశివారెడ్డి, సుధాకర్ గాయపడ్డారు. సోమందేపల్లి మండలంలోని పత్తిగుంటపల్లికి చెందిన వెంకటశివారెడ్డి, అతడి భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే గోరంట్లలోని బంధువులతో మాట్లాడి పెడబల్లికి చెందిన సోమే నాయక్ కుమారుడు సుధాకర్ ద్విచక్రవాహనంపై గోరంట్ల నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా వెంకటశివా రెడ్డి, సుధాకర్ గాయపడగా, వారిని గోరంట్ల ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని వైద్యులు సూచించారు.

ఫైర్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన రవీంద్రారెడ్డి

మడకశిర, ఫిబ్రవరి 7 : మండలంలోని చీపులేటి గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి బుధవారం పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని, ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది అతడిని వారించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఫైర్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న వ్యక్తి కారణంగా తన సంసారం చిక్కుల్లో పడిందన్నాడు. తన భార్య రెండు రోజులుగా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ముగ్గురు పిల్లలనీ, గత రాత్రి నుంచి అమ్మను చూపించమని వారు రోదిస్తుంటే అదిచూసి తట్టుకోలేక పోతున్నానన్నాడు. తనకు న్యాయం చేయాలని కన్నీరుమున్నీరయ్యాడు. హోంగార్డుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తూతూమంత్రంగా మండల సమావేశం

లేపాక్షి, ఫిబ్రవరి 7: మండల సమస్యలపై నిర్వహించే సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ వెంకటర త్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి అరకొరగా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజర య్యారు. దీంతో సమావేశాన్ని 12.20గంటలకు ముగించేశారు. అధికారులు పూరిస్థాయిలో హాజ రు కాకపోవడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కావడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో మండల వ్యాప్తంగా చేపట్టా ల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. జరగబోయే సమావేశాల్లోనైనా పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతు న్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, తహసీల్దార్ బాలనరసింహులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధం

రొద్దం, ఫిబ్రవరి 7 : మండల కేంద్రంలోని ఓ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి కంప్యూటర్, విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి. బుధవా రం తెల్లవారుజామున 3గంటల సమయంలో వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో వస్తువులు దహనం కావడంతో రూ.70వేలు ఆస్తినష్టం సంభవించింది. అయితే అందులో ఉన్న గ్యాస్ సిలెండర్ మంటలు వ్యాపించినా పేలకపోవడంతో పక్కనే ఉన్న ఇళ్లకు ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల ఇళ్లవారు గమనించి మంటను ఆర్పేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు.

ఈ ప్రభుత్వంలో సర్పంచులు కావడం మా ఖర్మ

మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన



సమావేశంలో ఆవేదన వ్యక్తం స్తున్న ఎంపీటీసీలు, సర్పంచులు

హిందూపురం, ఫిబ్రవరి7: ఈ ప్రభుత్వంలో సర్పంచులుగా గెలవడం మా ఖర్మ అంటూ మండలంలోని పూలకుంట గ్రామ సర్పంచ్ మంజునాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ రత్నమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పూలకుంట సర్పంచ్ మాట్లాడుతూ ... మాకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు మొహం చూపించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి 11 సమావేశాలు పూర్తి అయ్యాయని, ఈ ప్రభుత్వం దిగిపోతోందన్నారు. తాము సర్పంచులుగా వచ్చి మూడేళ్లు కావస్తున్నా... మొదటి సమావేశంలో చెప్పిన సమస్య ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఉదయం లేచిన వెంటనే పల్లెల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తారని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళితే... నిధులు లేవని, తామేమీ చేయలేమని అంటున్నారన్నారు. తాము వీధుల్లో తిరగలేకపోతున్నామని, ఈ సమయంలో సర్పంచులుగా గెలవడం తమ దౌర్భాగ్యం అన్నారు. వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులే సమస్యలపై నిలదీస్తున్నారని, కొంత మంది చెప్పలేకపోతున్నారని అన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలెవ్వరూ సంతృప్తిగా లేరన్నారు. ఎం బీరేపల్లికి చెందిన వైసీపీ ఎంపీటీసీ రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.... మండలంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. పల్లెల్లో కర్ణాటక మద్యం ఏ వీధిలో చూసినా విచ్చలవిడిగా అమ్ముతున్నారని, ఎక్సైజ్, సెబ్, సివిల్ పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో చిన్న వయసుకే మద్యానికి అలవాటు పడుతున్నారన్నారు. పల్లెల్లో ఎవరెవరు మద్యం అమ్ముతున్నారో తెలుసినా పోలీసులు మామూళ్ల మత్తుకు అలవాటు పడి అటువైపు కన్నెత్తికూడా చూడలేదన్నారు. కొంత మంది పోలీసులే మనుషులను పెట్టి అమ్మిస్తున్నారని మరో ఎంపీటీసీ ధనుంజయరెడ్డి ఆరోపించారు. అలాగే ధనుంజయరెడ్డి మాట్లాడుతూ... మీరిచ్చే టీ కాఫీ తాగడానికి మూడునెలలకు ఒకసారి జరిగే మీటింగ్‌కి రావాల్సిన పని లేదన్నారు. ఇప్పటి వరకు అజెండాలో ఎన్ని అంశాలను పొందుపర్చారు, వాటిని ఆమోదించేలా తీర్మానం తీసుకున్నారా అని ప్రశ్నించారు. అజెండా లేని సమావేశం ఎందుకన్నారు. అర్హులైన దివ్యాంగుడికి ఒక ట్రైసైకిల్ ఇప్పించలేని దుస్థితిలో ఉన్నామన్నారు. మీటింగ్ వాయిదా వేయాలని పట్టుపట్టారు. దీనిపై ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని, సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలను, తెలియజేసే సమస్యలను రికార్డు చేసి వచ్చే సమావేశం నుంచి సమాధానం ఇస్తామని తెలిపరు.

సెల్‌ఫోన్‌లో నిమగ్నం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో పలువురు అధికా రులు, ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలపై ఆలో చించకుండా సెల్‌ఫోన్లో నిమగ్న మయ్యారు. హిం దూపురం మండల సర్వసభ్య సమావేశం బుధవా రం జరిగింది. అయితే ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళుతుండగా... కొంత మంది అధికారుల, ప్రజాప్రతినిధులు తమకే మీ పట్టనట్లుగా సెల్‌ఫోన్ల నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా వారిని చూసిన ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి వీరు ఎందుకొచ్చారో అని చర్చించుకోవడం కనిపించింది.



సెల్‌ఫోన్లలో నిమగ్నమైన అధికారులు, ఎంపీటీసీలు

చిలమత్తూరుకు చేరుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు, ఫిబ్రవరి 7: హిందూపురంలో గురువారం టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించేందుకు వస్తున్న స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ బుధవారం సాయంత్రం చిలమత్తూరు మండలానికి చేరుకున్నారు. ఆయన కోడూరు తోపు సమీపంలో ఉన్న బయోటెక్ ఇండస్ జీన్ పరిశ్రమలో రాత్రికి బస చేయనున్నారు. అనంతరం గురువారం ఉదయం హిందూపురం బయలుదేరి వెళ్లనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు: బీకే



జయహో బీసీ అంటున్న బీకే, నాయకులు

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఫిబ్రవరి 7 : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అన్నారు. మండలకేంద్రమైన సోమందేపల్లిలోని టీడీపీ కార్యాలయం సమీపంలో జయహో బీసీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే పార్థసారథి మాట్లాడుతూ... ప్రాణాలు అర్పించైనా బీసీల ఐక్యతతో తెలుగుదేశం పార్టీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు వెంట బీసీలంతా ఐక్యతతో ఉండి అన్ని నియోజకవర్గాలను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర సాధికార సభ్యులు సగర గోపాల్, నాగమణి, నీరుగంటి చంద్ర, అనసూయమ్మ, సుజాత, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ పెనుకొండ పరిశీలకుడిగా నరసింహరావు



బీకేతో పరిశీలకుడు నరసింహరావు

పెనుకొండ, ఫిబ్రవరి 7 : టీడీపీ నియోజకవర్గం పరిశీలకుడిగా డాక్టర్ నరసింహరావు నియమితులయ్యారు. ప్రస్తుతం పరిశీలకుడిగా ఉన్న నరసింహయాదవ్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఆళ్లగడ్డకు చెందిన టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ నరసింహరావు నియమితులయ్యారు. బుధవారం ఆయన అనంతపురంలో బీకే పార్థసారధిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు స్థానిక నాయకులు తెలిపారు.

గుండెపోటుతో మడకశిర మున్సిపల్ కమిషనర్ మృతి



మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ (ఫైల్)

కదిరి, ఫిబ్రవరి 7: మడరశిర మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ (55) బుధ వారం కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో గుండెపోటుతో మృతిచెందారు. మడకశిర నుంచి కోర్టు పనిమీద రాయచోటికి వెళ్లడానికి కదిరి బస్టాండ్‌లో ఉండగా, ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు డాక్ట ర్లు నిర్ధారించారు. ఈవిషయాన్ని కుటుంబ సభ్యుల కు తెలియచేసినట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

విరివిగా మొక్కలు నాటుదాం

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో వక్తలు



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 7 : ప్రతి ఇంటి వద్ద విరివిగా మొక్కలు నాటి పర్యావర ణాన్ని పెంపొందించుకుందామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పెనుకొండ నగర పంచాయతీ లోని మంగాపురంలో వారంరోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... కలుషిత వాతావరణాన్ని నివారించే శక్తి, స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు మొక్క లు నాటడమేకాక వాటిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహమూర్తి, రామచంద్రయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 7: హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుతున్న 32మంది విద్యార్థులకు ఆర్డీటీ వారు ఆ సంస్థ స్థానిక కార్యాలయంలో బుధవారం క్విజ్ ఫెస్టివల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోపి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ ఇలియాజ్

పెనుకొండ, ఫిబ్రవరి 7 : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని న్యాయవాది హఫీజ్ పేర్కొన్నారు. స్థానిక ఘనగిరి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్‌డేను కరస్పాండెంట్ ఇలియాజ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ హెచ్‌ఎం ప్రభంజన్‌కుమార్, న్యాయవాది హాఫీజ్‌లు హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థి ఆత్మహత్య

కొత్తచెరువు, ఫిబ్రవరి 7: మండలకేంద్రానికి చెందిన విద్యార్థి మణిదీప్(20) కర్ణాటకలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకెళ్తే.. కొత్తచెరువుకు చెందిన కురుబ నాగేంద్ర కుమారుడు మణిదీప్ కర్ణాటక రాష్ట్రంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా ఇటీవల జరిగిన పరీక్షల్లో మూడు సబ్జెట్‌లు తప్పాడు. ఇందుకు మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు వచ్చారని హాస్టల్ నుంచి బయటికి వెళ్లాడు. అదే సమయంలో దొడ్డబళ్లాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి మెడలోని ఐడీ కార్డు ఆధారంగా స్థానికులు యూనివర్సిటీకి సమాచారం అందించారు. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థి తల్లితండ్రులకు సమాచారం చేరవేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.